డీబీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజేంద్రరావు

హిమాయత్‌నగర్, జూలై 10: దళిత బహుజన పార్టీ (డీబీపీ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నక్కా రాజేంద్ర రావు నియమితులయ్యారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత బహుజనులకు రాజ్యాధికారం వచ్చేందుకు అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు సాగుతానని తెలిపారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

బండ్లగూడ, జూలై 10: గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరారెడ్డి వివరాల ప్రకారం.. అత్తాపూర్ ముసక్ మహల్‌లోని పురాతన గోడల్లో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం అందింది. రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు దాడి చేశారు. గంజాయి అమ్మకందారులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 2.5 కేజీల గంజా యి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

భద్రతే లక్ష్యంగా తనిఖీలు

జూబ్లీహిల్స్: పాఠశాల విద్యార్థుల భద్రత లక్ష్యంగా స్కూల్ ఆటో, వ్యాన్, బస్‌లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆర్టీఏ సమన్వయంతో నగరంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, యూనిఫాం, ఇన్స్యూరెన్స్, ఓవర్ లోడింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో విస్తృతనిఖీలు చేపట్టారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారాలు



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ

నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ

మణికొండ, జూలై 10: కోట్లాది నిధులతో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో రూ.50 లక్షల వ్యయంతో నూతన సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమానికి కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్ కొల్లూరు లక్ష్మి ప్రవళికతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కొంత కాలంగా రోడ్లు గుంతల మయంగా మారడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. దీంతో సమస్యను తన దృష్టికి తేవడంతో వెంటనే నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించామని తెలిపారు. శరవేగంగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకువస్తే వాటికి శాశ్వత పరిష్కారాలు చూపేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నర్సింహ్మ రాజు, గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు వేణుగౌడ్, మహేందర్ గౌడ్, అఖిల్, కళ్యాణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

చీరలను కొనుగోలు చేస్తున్న మహిళ

వెంగళరావునగర్, జూలై 10: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024 మహిళలను అమితంగా ఆకట్టుకుంటుంది. సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేతకళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే ఉద్దేశంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు జయేశ్‌గుప్తా తెలిపారు. ప్రదర్శన ఈ నెల 14 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కార్పొరేషన్‌కు హిమయాత్‌సాగర్ నీళ్లు

బండ్లగూడ జాగీర్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, జూలై 10: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు తాగు నీరు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. హిమయాత్‌సాగర్ వాటర్ బెడ్‌ను జలమండలి అధికారులతో కలిసి ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నీటి సరఫరాపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌కు కూడా ప్రతిరోజు 30లక్షల లీటర్ల నీటిని అందించ వచ్చని అధికారులు వివరించినట్లు తెలిపారు. అతి త్వరలో కార్పొరేషన్‌కు హిమయాత్‌సాగర్ నీళ్లు అందిస్తామన్నారు. ఇందుకోసం అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ పేర్కొన్నారు.

జలమండలి అధికారులతో చర్చిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

డిప్లామా కౌన్సెలింగ్ ప్రారంభం

ధ్రువపత్రాలు అందజేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 10: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్, విశ్వవిద్యాల పరిధిలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాలిటెక్నిక్ కోర్సులకు బుధవారం యూనివర్సిటీ ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రారంభ మైంది. ఉత్తమ ర్యాంకు సాధించిన అరియా జరియా జరీన్‌కు జగిత్యాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశం కల్పిస్తూ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి ధ్రువపత్రాలు అందజేశారు. రెండేండ్ల వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ డిప్లామా, మూడేండ్ల డిప్లామా ఇన్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు ఈ నెల 12వరకు కొనసాగుతాయి. ఈ ఏడాది (2024)పాలిసెట్ ర్యాంకుల ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు www.pjtsau.edu.in సంప్రదించాలని ఆయన సూచించారు.

సమస్యలతో సర్కారు బడులు సతమతం

ఎర్రగడ్డ, జూలై 10: బడులు తెరుచుకొని నెల కావస్తున్నా కనీస వసతులు కరువయ్యాయని సీపీఎం నేతలు సర్కారుపై ధ్వజమెత్తారు. బస్తీబాటలో భాగంగా బుధవారం బోరబండ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను సీపీఎం నేతలు గుర్తించారు. విద్యార్థుల సంఖ్య సుమారు 1500 ఉన్న నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవటం వల్ల విద్యార్థినులు అవస్థలు పడుతున్నారని పార్టీ నేతలు సాయిశేషగిరిరావు, జె.స్వామి పేర్కొన్నారు. పార్టీ నేతలు దాదిమళ్ల కృష్ణ, నరేశ్, సికిందర్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు నిధులు ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, జూలై 10: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధిక నిధులు ఆలయాలకు ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, వైద్య శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేసేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జి.రామన్‌గౌడ్, మహేశ్, చైతన్య పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్ల ఆగడాలను కట్టడి చేయాలి

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ధర్మేంద్ర

హిమాయత్‌నగర్, జూలై 10: రాష్ట్రంలో పలు రకాల పేర్లతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు చేసే ఆగడాలను కట్టడి చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఇష్టం వచ్చినట్లు ఫీజులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఒక్కో సెంటర్‌లో లెక్కకు మించి నిరుద్యోగులను కూర్చొబెట్టి శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. వేలు వెచ్చించినా నిరుద్యోగ యువతకు మెరుగైన సేవలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెజార్టీ నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని కొన్ని పోటీ పరీక్షలను వాయిదా వేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరంగా ఉన్న స్టడీ సర్కిల్స్‌ను నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు లింగం, రవి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్యప్రసాద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం

ఖైరతాబాద్, జూలై 10: మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లను ప్రోత్సహించేందుకు హోటల్ తాజ్ కృష్ణలో ఏర్పాటు చేసిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టయిల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను మిస్ గ్రాండ్ ఇండియా 2022, తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్ర మిస్ యూనివర్స్ డైరెక్టర్ ప్రాచీ నాగ్‌పాల్, నిర్వాహకుడు ఉమేశ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు.

ఎస్పీఆర్ హిల్స్‌కు బస్సు సౌకర్యం కల్పించండి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

జూబ్లీహిల్స్, జూలై 10: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికనగర్ నుంచి ఎస్పీఆర్ హిల్స్ మీదుగా శ్రీరామ్‌నగర్ వరకు.. బోరబండ, శ్రీరాంనగర్ నుంచి ఎస్పీఆర్ హిల్స్, కార్మికనగర్ మీదుగా యూసుఫ్‌గూడ వెళ్లే విధంగా బస్ సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

విద్యార్థులే వలంటీర్లు.. డెంగీపై సమరం

ఖైరతాబాద్, జూలై 10: గ్రేటర్‌లో డెంగీ వ్యాప్తిని అరికట్టేందుకు విద్యార్థులే వలంటీర్లుగా జీహెచ్‌ఎంసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బుధవారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్లు, ఏఎంవోహెచ్, అర్బన్ మలేరియా, ఎంటమాలజిస్టులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి వివరాలను వెల్లడించారు. కాలింగ్ ఆల్ హీరోస్ పేరుతో ప్రత్యేకమైన క్యాంపెయిన్‌కు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేస్తున్నామన్నారు. 14 నుంచి 22 ఏండ్లలోపు విద్యార్థులందరూ పాలుపంచుకోవచ్చని తెలిపారు. ఈనెల 21 వరకు ఆసక్తి గల విద్యార్థులు తమ ఎంట్రీలను జీహెచ్‌ఎంసీకి పంపవచ్చన్నారు. డెంగీ నివారణలో భాగంగా వారు ఆయా కాలనీలు, వార్డులకు వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగింపచేయడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తారన్నారు. 12 వారాల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అవగాహన కార్యక్రమంలో భాగస్వాములైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

నార్సింగి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రూ.1.01 కోట్ల బడ్జెట్ ఆమోదం

నార్సింగి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ

మణికొండ, జూలై 10: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కోట్లాది నిధులు వెచ్చించి అభివృద్ధి పనులను చేపడుతున్నామని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.4.29 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. సీసీ పనుల కోసం రూ.60లక్షలు, వైకుంఠదామం పనులకు రూ.20 లక్షలు, ప్రహరీ పనులకు రూ.1.18 కోట్లు, వన మహోత్సవానికి రూ.15 లక్షలు, బోనాల పండుగకు రూ.10లక్షలు, జంక్షన్ డెవలప్‌మెంట్ పనులకు 25 లక్షలు, ఎల్ఆర్టీకల్ పనులకు 50 లక్షలు, కమ్యూనిటీహాల్ పనులకు 30 లక్షలు, ఇతర పనులకు 1.01 కోట్ల రూపాయలను ఆమోదింపజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రజాధనం వృథా కాకుండా ప్రతిరూపాయి ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా పాటుపడతామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ గోపాల విజయ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్, ఏఈ ఎస్.శ్రీనివాస్, మేనేజర్ యోగేశ్, జలమండలి అధికారులు, విద్యుత్ ఏఈ సందీప్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతపై ప్రభుత్వం కృషిచేస్తుంది

పదవీ బాధ్యతలు చేపడుతున్న శోభారాణి, చిత్రంలో మంత్రి సీతక్క

వెంగళరావునగర్, జూలై 10: మహిళల భద్రతపై ప్రభుత్వం కృషిచేస్తుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మధురానగర్‌లోని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా నియమితులైన బంద్రు శోభారాణి పదవీ బాధ్యతల స్వీకారోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీఎంకు శోభారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ.కాంతి వెస్లీ, జాయింట్ డైరెక్టర్ సునంద, లక్ష్మీదేవి, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శంషాబాద్ రూరల్, జూలై 10: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను పరిష్కారం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ పేర్కొన్నారు. బుధవారం శంషాబాద్ పట్టనంలోని భవన నిర్మాణ కార్మికులతో కలిసి అసిస్టెంట్ లేబర్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి డిమాండ్లను నెరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం, 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టాలను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమయ్య, మండల అధ్యక్షుడు మల్లేశ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

మణికొండ: బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని ఆశా వర్కర్స్ అధ్యక్షురాలు లత, అంగన్‌వాడీ అధ్యక్షురాలు సుధారాణి పేర్కొన్నారు. నార్సింగి చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి కార్మికుల డిమాండ్ల డేను నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, సులోచన, ఆటో కార్మికులు చారి, సునీల్, అనిల్, రాజు ఉన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు మూల్యం చెల్లించాల్సిందేనని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కురుమయ్య, ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ అన్నారు. కార్మికుల కోరికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్, స్వామి, ఇమ్రాన్, పార్వతి, షమీంబేగం, వికీ్కసింగ్, ముజ్జు ఖాన్, మహేశ్‌యాదవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ: తమ న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలపాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మోతీనగర్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. లేబర్ అడ్డాల వద్ద షెడ్డు, మరుగు దొడ్లను భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు టి.సాయిశేషగిరిరావు, అశోక్, బాలు, సోమేశ్, మహమూద్, యాదగిరి, వెంకటేశ్, అలీ ఖాన్, లక్ష్మమ్మ, సావిత్రమ్మలతో పాటు అడ్డా కార్మికులు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు ఇవ్వాలి

ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏ వారసులు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 10: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నంబర్ 81, 85 ప్రకారం 61 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏ వారసులకు త్వరిత గతిన నియామక ఉత్వర్వులు అందేలా కృషి చేయాలని సంఘం ప్రతినిధులు కోరారు. బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యూలర్ చేస్తూ కారుణ్య నియామకాల కోసం జీవోఎంఎస్ నంబర్ 81, 85 ప్రకారం 3797 మంది 61 ఏండ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకం కోసం జీవోలు జారీ చేశారన్నారు. కానీ జీవోలపై స్టే కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. నవంబర్ 21, 2023న హైకోర్టు డివిజన్ జీవో 81పై స్టే ఎత్తివేసిందన్నారు. వెంటనే తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

శంషాబాద్ రూరల్, జూలై 10: వ్యక్తి అదృశ్యమైన సంఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్దునూర్ మండలం కుర్ల గ్రామానికి దబిడే బస్వంత్(40) బతుకుదేరువు కోసం శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ తండా పరిధిలోని ఆశోక్ ఫామ్‌హౌజ్‌కు వచ్చి అక్కడే ఉంటున్నారు. ఈనెల 9న ఫామ్‌హౌజ్ నుంచి కుటుంబీకులకు చెప్పకుండా వెళ్లి.. తిరిగి రాలేదు. నా కోసం వెతకొద్దని తన మిత్రడు రాజుకు వాట్సాప్ ద్వారా తెలిపాడు. 10న మారోసారి సారీ రాజా అంటు మేసేజ్ చేశాడు. దీంతో బస్వంత్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్స్‌లో ఆక్రమణలు కూల్చివేత

ఖైరతాబాద్, జూలై 10: నిమ్స్ దశాబ్ది బ్లాక్ నిర్మాణంలో భాగంగా దవాఖాన స్థలంలో పలు ఆక్రమణలను అధికారులు తొలగించేశారు. ఆర్నెళ్ల క్రితమే పలు ఆక్రమణలను తొలగించగా, ఓ బట్టల షాపు, కూరగాయల దుకాణంతో పాటు చిరు వ్యాపారాల దుకాణాలను మాత్రం తొలగించలేదు. ఇప్పటికే కూరగాయల మండీ అనేక ఏండ్లుగా నిర్వహిస్తున్నామని, తమకు కొంత సమయం ఇవ్వాలంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో కూరగాయల మండిని మినాహాయించి మిగతా చిన్న చిన్న షాపులను బుల్డోజర్ల సాయంతో కూల్చివేశారు. కాగా, నిమ్స్ అధికారులు పంజాగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పెద్ద ఎత్తున సిబ్బందిని మోహరింప చేశారు. ఓ షాపునకు సంబంధించిన ఇద్దరు గొడవకు దిగగా, వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికే ఆస్పత్రి ఖాళీ స్థలంలో అక్రమ పార్కింగ్‌లు ఏర్పాటు చేసుకోగా, వాటిపై అధికారులు ఇప్పటికే చర్యలకు ఉపక్రమించగా, తాజాగా ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించి 2000 పడకలతో నిర్మించే దశాబ్ది బ్లాక్ నిర్మాణానికి మార్గం సుగమం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.